# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 31 మార్చి, 2024 | పేజీలు : 05

## కాంగ్రెస్‌లో కడియం కాక





వివరాలు మెయిన్‌లో...

# వేసవికాలం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** గ్రామాలలో మంచినీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే అందుకు ప్రత్యామ్నాయంగా త్రాగునీరు అందించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ ఆర్ డబ్ల్యూఎస్, గ్రిడ్, పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో వేసవిలో త్రాగు నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు, వివిధ దశలలో ఉన్న పనుల పురోగతి పై ఆర్‌డబ్లూఎస్, గ్రిడ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడిఓ లతో గ్రామ పంచాయితీ, మున్సిపల్ వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయితీ మున్సిపల్ లలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్,గ్రామాలలో మరమ్మత్తులలో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్లు లీకేజి మరమ్మత్తులు, నూతన పైపు లైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డిఎఫ్) డిఎంఎఫ్‌టి నిధుల నుండి అన్ని గ్రామ పంచాయితీలకు మున్సిపల్ లకు నిధులు కేయించిందని సూచించారు. మంచినీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి పంచాయతి రాజ్, ఆర్‌డబ్లుఎస్, మున్సిపల్ అధికారులు అందచేసిన నివేదికలు ఆధారంగానే నిధులు మంజూరు చేశామని అన్నారు. ఎక్కడైనా మంచినీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలన్నారు. వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రత్యాన్మయ ఏర్పాట్లుతో నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మంచినీటి వనరులు మాత్రమే కాకుండా ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాలలో నీటిని అందించడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాలలో ప్రైవేటు బోర్లు, బావులు ఇతర నీటి వనరుల వివరాలు సేకరించి నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితులలో వాటి ద్వారా గ్రామ ప్రజలకు నీటిని సరఫరా చేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాలలో ప్రజల అవసరాలకు ఎన్ని లీటర్ల నీరు అవసరం ఉందో ఏప్రిల్ 04వ తేదీ వరకు పూర్తి చేసి నివేదికలు అందచేయాలని, ఎక్కడైనా మరమ్మత్తులు పూర్తికాకపోతే అందుకు కారణాలను ఎంపిడిఓ, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బంది సంయుక్తంగా దృవీకరణతో నివేదికలు అందచేయాలని ఆదేశించారు. వేసవి కాలం ముగిసేంత వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా త్రాగునీటికి ఇబ్బంది రావొద్దని ఆయన పేర్కొన్నారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని, మరమ్మత్తులకు వినియోగించే సామగ్రి నాణ్యత ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్, ఆర్ డబ్ల్యూఎస్, గ్రిడ్, పంచాయతి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేవరుప్పులలో పంటల పరిశీలన

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం జిల్లాల పర్యటను రానున్నారు. ఆదివారం జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామంలో ఎండిన పంటల్ని పరిశీలించనున్నారు. ఆ తరువాత సూర్యపేట జిల్లాకు వెళ్తారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా దిగిపోయిన తరువాత చేపట్టిన జిల్లా పర్యటనలో మొదటిది ఈ కార్యక్రమం. ఎన్నికల తరువాత తన ఫాంహౌజ్‌లో కాలుజారి పడిపోయిన కేసీఆర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంటున్నారు. ఆదివారం కేసీఆర్ తన ఫాంహౌస్ ఎర్రవెల్లి నుండి 8.30 గంటలకు బయలుదేరున్నారు. 10.30 గంటల వరకు దేవరుప్పుల ధర్మపురం గ్రామానికి చేరుకుంటారు. పక్కనే ఉన్న ధర్మాపురం, ధర్మగడ్డ తండాల్లోని ఎండిన పంట పొలాలను పరిశీలిస్తారు. అక్కడి నుండి 11 గంటలకు బయలుదేరి11.30 గంటలకు తుంగతుర్తి మండలానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా పోలీసులు బందోస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముందే అక్కడకు వెళ్లి రైతులు, కార్యకర్తల్ని సిద్ధం చేశారు. పోలీసులు సైతం గట్టి బందోబస్తు చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ రాక సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మాజీ ఎంఎల్‌ఎలు, ముఖ్య నాయకులు సైతం హాజరయ్యే అవకాశం ఉంది.

# బస్టాండ్‌లో కొమురవెల్లి భక్తుల విలవిల



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ బస్టాండ్ నుండి కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి దేవస్థానానికి వెల్లాల్సిన భక్తులు విలవిలలాడారు. ఆదివారం మొక్కుల సందర్భంగా శనివారం మధ్యాహ్నం నుండే అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకొని బస్సుల కోసం ఎదురుచూశారు. ఆర్టీసి యాజమాన్యం ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయకపోగా భక్తుల రద్దీని చూసైనా అదనపు బస్సులు ఏర్పాటు చేయలేదు. సాయంత్రం 7 నుండి 9 గంటల మధ్యలో సుమారు వేయి మందికి పైగా భక్తులు బస్టాండ్‌లోనే బస్సుల కోసం ఎదురుచూశారు. కొందరు వృద్దులు నీరసించి పోవడంతోపాటు ఎట్లా వెల్లాలంటూ అధికారులతో మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో కొందరు భక్తులు బస్టాండ్‌లోనే మూట,ముల్లా పెట్టుకొని నిద్రపోయిన పరిస్థితి. చివరకు 9 గంటల సమయంలో రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయగా కొందరు మాత్రమే వెళ్లారు. మిగతా వారంతా ఇబ్బందులు పడుతూ బస్టాండ్‌లో సేదతీరిన పరిస్థితి. భక్తుల రద్దీని ఆర్టీసి డీఎం కల్లారా చూస్తున్నప్పటికీ వారికి కనీస వసతులు, బస్సు సౌకర్యం కల్పించకపోవడం శోచనీయం. కొందరు ప్రయాణికులు బస్టాండ్‌లోని రిసెప్షన్ కౌంటర్ వద్ద కూడా సిబ్బందిపై ఆగ్రహం చేసిన పరిస్థితి.

# హత్య కేసులో ఇరువురి అరెస్టు




**ప్రజాపక్షం/నర్సంపేట :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామానికి చెందిన సుప్రియ హత్య సంబందించిన నిందితులను శనివారం అరెస్టు వారి వివరాలను డిసిపి రవిందర్ వెల్లడించారు. మైసంపల్లి గ్రామానికి చెందిన వెంగళ సుప్రియ, ఆమె భర్త రాజ్‌కిరణ్ ఇద్దరు పిల్లలతో కలిసి మైసంపల్లి గ్రామంలో నివాసం ఉండేదని, భర్త హనుమకొండ లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ వుండెవాడని. నిందితులు శశికాంత్, శిరిషలు హైదారాబాద్‌లో నివసిస్తున్నారని ఒక నెల రోజుల క్రితం తనకు అనారోగ్య కారణాలతో సుప్రియ శశికాంత్‌కు ఫోన్ చేసి ఆసుపత్రుల గురించి తెలుసుకుంది. ఈ ఫోన్ కాల్ విషయంలో శశికాంత్‌కు శిరిషకు గోడవ జరిగిందని, నిందితులు ఇద్దరు ఒక రోజు హైదారబాద్ నుండి హోండా షైన్ బైక్ పై మైసం పల్లి గ్రామానికి వచ్చి సుప్రియను హెచ్చరించి తిరిగి అదే బైక్ పై హైదారబాద్‌కు వెళ్లారని, అప్పుడు ఇంట్లో సుప్రియ ఒకతే ఉండేదని, ఆ సమయంలో సుప్రియ ఒంటిపైనున్న బంగారాన్ని చూసి ఓ దూరాలోచనతో సుప్రియను చంపి బంగారం ఎలగైనా దొంగతనం చేయాలని పథకం వేసిపట్లు డిసిపి వివరించారు. మరోక రోజు మార్చి 23న హైదారబాద్ నుండి మైసంపల్లి గ్రామనికి వచ్చి మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో సుప్రియకు వీపరితంగ కోట్టి నిందితురాలు కాళ్లు పట్టుకంటే శశికాంత్ గొంతు పిసికి చంపి తన ఒంటిపై ఉన్న బంగారం, ఇంట్లో వున్న బంగారం తీసుకొని వెళ్ళినట్లు డిసిపి పేర్కోన్నారు. తిరిగి ఆదే బైక్‌పై వెళ్లి హైదారబాద్‌లోని ఎఎస్ రావు నగర్‌లోని బీమాగోల్డ్ కంపెనిలో పుస్తెల తాడు,రింగును కరిగించి శిరీష, శశికాంత్‌లు రెండు గోల్డ్ చైన్లు చేయించుకున్నారు. దొంగిలించిన జత కమ్మలను కరిగించి శిరీష కొత్త కమ్మలను చేయించుకున్నట్లు, మిగిలిప దొంగలించిన వస్తువులను అమ్ముకోవడానికి ఖానాపురం మండలంలో తెలిసిన వారి దగ్గరికి వస్తుండగా పోలీసులు వాహనాల తనీఖీల చేస్తూందగా వారు పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు వారికి పట్టుకొని విచారించగా పై నేరాన్ని ఒప్పుకున్నారిని వారి అరెస్టు చేసి నర్సంపేట కోర్టులో హాజరు పరిచినట్లు డిసిపి రవిందర్ వివరించారు. ఈ సమావేశంలో ఎసిపి కిరణ్, సిఐలు రమణామూర్తి, రాజగోపాల్ గౌడ్, ఎస్ఐ పరమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ చేపట్టాలి



4 లో

## ప్రారంభించినా .. ఫలితం లేదు



3 లో

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

**ప్రజాపక్షం/పరకాల :** నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శనివారం పరకాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో లేదని ఎవరూ అదైర్యపడొద్దు అన్నారు. కార్యకర్తలకు తాను అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా పార్టీలోనే ఉంటామని అన్నారు. వంద రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజలకు వివరించాలని, ప్రజల తరుపున హామీల అమలుకు పోరాడాలని అన్నారు.రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలి ఎమ్మెల్యేలను కొనే పనిలో పడ్డారని,తెలంగాణ ప్రజలు చైతన్య వంతులని అన్ని విషయలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీని వీడిన వారితో నష్టమేమీ లేదని, బీఆర్ఎస్ జెండా మోసే ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని చెప్పారు. పదేండ్లు అధికారం అనుభవించి నేడు పదవుల కోసం పార్టీలు మారుతున్నారని, ఏడాదిలోనే కాంగ్రెస్‌లో సంక్షోభం ఏర్పడుతుందని అన్నారు. పదేళ్లలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌దేనని, కానీ కాంగ్రెస్ మూడు నెలల్లోనే దిగజార్చిందని అన్నారు.



పరకాల నియోజకవర్గంలో తమ హయాంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు,మండల నాయకులు పాల్గొన్నారు

## గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన లైబ్రరీ విద్యార్థులు

**ప్రజాపక్షం/హన్మకొండటౌన్ :** రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను సెంట్రల్ లైశ్రీబరీ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రంథాలయ అధికారి మధుసూదన్, గ్రంథాలయ విద్యార్థి నాయకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గ రియాజ్ నియమితులైన సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హసన్‌పర్తి మండల కేంద్రంలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రం నుంచి హన్మకొండ సిబీసీ చర్చి వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, దూబల భాస్కర్ మాట్లాడారు. స్థానిక పాస్టర్ జాన్సన్, సంఘ పెద్దలు ఇమ్మడి సుధాకర్, బోడ యుగంధర్, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మేకల సదానందం, జన్ను సదానందం, జన్ను చేరాలు, మట్టెడ సురేందర్, జూపాక నాగరాజు, మేకల విలియం, బిగుళ్ల ఇమ్మానుయేల్, మేకల సిద్ధార్థ,ఆరెపల్లి శాంతి కిరణ్,బిగుళ్ల ప్రేమ్,మేకల రాజు,భరత్,కరుణాకర్, సురేందర్, శ్రీకాంత్, క్రాంతి, కమల్ పాల్గొన్నారు.

## కుడా చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** వరంగల్ జిల్లా కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని గ్రేటర్ వరంగల్ పరిధి 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రవీందర్‌రెడ్డి హన్మకొండలోని వెంకట్రాంరెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ కందుకూరి పూర్ణచందర్, ఓబీసీ కోఆర్డినేటర్ బొమ్మ చంద్రమౌళిగౌడ్, అడ్వకేట్ కందుకూరి రజనీకాంత్ పాల్గొన్నారు.

## శ్రీగట్టుమల్లికార్జునస్వామి దేవాలయ హుండీలెక్కింపు

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరుమండలంలోని మల్లికుదుర్ల గ్రామశివారులోని శ్రీగట్టుమల్లికార్జునస్వామి దేవాలయహుండీలెక్కింపును ఆలయ కమిటీ చైర్మన్ పల్ల రమేష్‌రెడ్డి ఆద్వర్యంలో ఆలయ ఇఒ అద్దంకి నాగేశ్వర్‌రావు,పరిశీలకులు అనీల్‌కుమార్,శ్రీమాతాదేవిసేవాసమితి సభ్యులు హుండీలను లెక్కించగా 2,34192 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు .

## వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా చట్టం చేయాలి



**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి :** వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా చట్టం చేయాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు డాక్టర్ రియాజ్ కోరారు. భారతదేశంలో 70 శాతం పైగా ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా మార్చి చట్టం చేయాలని తెలంగాణ మేధావుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు డాక్టర్ రియాజ్‌ను తెలంగాణ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరస్వామి నాయకత్వంలో శనివారం హన్మకొండ జిల్లా కేంద్రం ఎక్సైజ్ కాలనీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ మేధావుల ఫోరం అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ చేతిలో ఆగమైన తెలంగాణ అనే పుస్తకాన్ని ముద్రించి టీపీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించ చేయడమైందన్నారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన దోపిడీ, భూ కబ్జాలు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, విద్యా వ్యవస్థ, వైద్య రంగం, దళిత బంధు, రైతు బందు, గొర్రెల పథకం, చేపల పథకం లాంటి అనేక పథకాల ద్వారా జరిగిన అవినీతిని వివరాలతో సహా వాస్తవాలను వెల్లడించి తెలంగాణ ప్రజలను చైతన్యం చేయడంలో ప్రధాన భూమిక పోషించి దోపిడీ ప్రభుత్వం పోయి ప్రజా ప్రభుత్వం రావడానికి ఫోరం ఎంతో మేలు చేసిందన్నారు. ఆ అంశాలు ప్రస్తుత ప్రభుత్వానికి ప్రాథమిక సమాచారంగా ఉపయోగపడతాయన్నారు. తనకు చేసిన సత్కారానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ మీరిచ్చిన విలువైన దేశ రైతుల భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసే వ్యవసాయ రంగానికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్న అంశాన్ని ఆల్ ఇండియా కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీకి వివరించి కాంగ్రెస్ తరపున రైతులకు న్యాయం చేసే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు డాక్టర్ సంజీవ్, నరేందర్ పాల్గొన్నారు.

## కడియం వెంటే కడియం అభిమానులు

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కడియం కావ్య నాయకత్వాన్ని బలపరుస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలంతా హైదరాబాద్‌లోని కడియం శ్రీహరి నివాసంలో డాక్టర్ కడియం కావ్యలకు మద్దతు తెలిపేందుకు భారీగా వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు కడియం శ్రీహరి, డాక్టర్ కడియం కావ్యలను మర్యాదపూర్వకంగా కలుసుకొని వారికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. అనంతరం మీ వెంటే మేము అంటూ కదిలివచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకుతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కడియం కావ్య సమావేశమయ్యారు. కార్యకర్తల అభీష్టం మేరకే తాము



నిర్ణయం తీసుకుంటున్నామని,కాంగ్రెస్ లోకి రావాలని ఏఐసీసీ నాయకులు కోరారని చెప్పారు.గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్నా ప్రతిపక్షం మాదిరిగానే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిస్థితి ఉందని, ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి బాగా లేదని, ఎన్నికలలో ఎవరూ సహకరించడం లేదని, తన కూతురు కడియం కావ్యను ఓడిపోయే పార్టీ నుండి మొదటి సారిగా నిలబెట్టలేనని అన్నారు. తన లాగే తన కూతురు ఆశీర్వదించాలని కడియం శ్రీహరి కోరారు.

## కడియం శ్రీహరిని కాంగ్రెస్‌పార్టీలో చేర్చుకోవాలి

### దళితబిడ్డ ఇందిరకు స్పష్టమైన హామీ ఇవ్వాలి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** దళితబిడ్డ ఇందిరకు స్పష్టమైన హామీ ఇచ్చి కడియం శ్రీహరిని కాంగ్రెస్‌పార్టీలోకి చేర్చుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుర్మసంఘం భవనంలో శనివారం మండల ఇంచార్జి బూడిద సదానందం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేయగా వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జెండాలను భుజాలపై మోసిన కార్యకర్తలు, నాయకుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, పార్టీని నమ్ముకొని గ్రామాలలో ఉన్నారని వారికి కూడా సరైన హామీ ఇచ్చిన తర్వాతే కడియం శ్రీహరిని తీసుకోవాలన్నారు. గతంలో రాజయ్య పక్కన ఉండి అవినీతికి పాల్పడిన నాయకులు రాజయ్యకు టికెట్ రాకపోవడంతో శ్రీహరి పక్కన చేరారని ఇపుడు కాంగ్రెస్‌లో చేరి పార్టీనే భ్రష్టుపట్టించే ప్రమాదం ఉందన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వస్తే కార్యకర్తలు సహించరన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నర్సింగ రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చీటకోరు సంపత్, జీడికల్ దేవస్థాన చైర్మన్ ఏలె మూర్తి, కాంగ్రెస్ మండల నాయకులు నీల మోహన్, చిట్కుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శ్రీహరి పట్ల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచించాలి



**ప్రజాపక్షం/వేలేరు :** తెలంగాణరాష్ట్ర కాంగ్రేస్ పార్టీ అధిష్టానం కడియం శ్రీహరి పట్ల పునరాలోచించాలని వేలేరు మండలకాంగ్రేస్ పార్టీఇంచార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు శనివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండలఅధ్యక్షుడు కత్తి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి,మండలయూత్‌అధ్యక్షుడు ఎండి సద్దాంహుస్సేన్,ఎస్‌సిసెల్ మండలఅధ్యక్షుడు జోడుముంతల సంపత్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రేస్‌పార్టీఅధిష్టానం కడియం శ్రీహరి పార్టీ మారీ కాంగ్రేస్‌లోచేరే ఉద్దేశాన్ని పునరాలోచించాలని కడియం శ్రీహరి తెలంగాణ ఉద్యమంలో పోరాడినవ్యక్తి కాకున్నా కూడా కెసిఆర్ అనేక ఉన్నత పదవులు కట్టబెట్టాడని ఆయన తన అనుచరవర్గానికే అనుకూలంగా ఉంటాడని ఎన్నేఏల్లుగా కాంగ్రేస్‌పార్టీలో ఉండి పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు ఇప్పుడు అయోమయంలో ఉన్నారని కడియం శ్రీహరి పార్టీని నమ్ముకున్న కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలకు కూడా అనుకూలంగా ఉండాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కత్తి సంపత్, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎండి సద్దాంహుస్సేన్, జోడుముంతల సంపత్, రాజమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రం



**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశామని డీఎస్‌వో రోజారాణి అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో మహాలక్ష్మి, ధనలక్ష్మి గ్రామసమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో డీఎస్‌వో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన దాన్యాన్ని నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని మధ్య ధలారీల చేతిలో మోసపోవద్దని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఎంపీవో మల్లిఖార్జున్, ఏపీఎం శంకరయ్య, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏఈవో సృజన, సీసీ శ్రీకాంత్, రైతులు, మహిళా సంఘాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మేరు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** వచ్చే తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా మేరు సంఘం జిల్లా క్యాలెండర్‌ను శనివారం సంఘం గౌరవ అద్యక్షులు కొత్తకొండ అజయ్‌కుమార్‌ఆధ్వర్యంలో జరగిన సభకు జిల్లా అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మేరు సంఘం అభివృద్ధికి సభ్యులు నిరంతరం శ్రమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేరు కులస్థులను ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటి సభ్యులు, పట్టణ అధ్యక్షులు రామగిరి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి రాపర్తి ప్రవీణ్, వివిధ మండలాల అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

**ప్రజాపక్షం/వేలేరు :** ఈనెల 18 వతేదీనుండీ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పదవ తరగతి పరీక్షలలో బాగంగా వేలేరు మండలంకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల,సేయింట్‌ఫ్రాన్సిస్ పాఠశాలలో జరిగిన పదవతరగతి పరీక్షలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగలేదని ప్రశాంతంగానే పదవతరగతి పరీక్షలు ముగిశాయని వేలేరు ఎపై హరిత,ఛీఫ్‌సూపరింటెండెంట్‌లు రాజన్న,ఎండి నయీంపాష తెలిపారు.

# ప్రారంభించినా.. ఫలితం లేదు

### లక్షలు వెచ్చించారు... లక్షణంగా వదిలేశారు



ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ : భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని కూరగాయల, పండ్ల వ్యాపారులు అనేక సమస్యలతో బాధపడుతున్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో 14 లక్షల 59 వేల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల బస్టాండ్ వద్దగల మెయిన్ రోడ్డు పై వీధి పండ్ల వ్యాపారుల కోసం ఫ్రూట్ షాప్ షెడ్డుల నిర్మాణం చేపట్టారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఈ ఫ్రూట్ షాప్ షెడ్లను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో నాటి పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేతులమీదుగా ఆ వ్యాపార సముదాయ షెడ్డులను ప్రారంభించారు. వాటిని ప్రారంభించి సంవత్సరం గడుస్తున్న ఇప్పటికీ పండ్ల వ్యాపారులు రోడ్డు పక్కన తోపుడు బండ్లపై పండ్లను రోడ్లపైనే విక్రయాలు కొనసాగిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుండి లక్షలు వెచ్చించి నిర్మించిన షాపులు అర్హులకు అందక అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి. కూరగాయల, పండ్ల మార్కెట్లో నాటి రాజకీయ నాయకుల సన్నిహితులకు షాపులు కేటాయించడం వల్ల అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించినప్పటికీ అవి సరైన లబ్ధిదారులకు అందకపోవడంతో చిరు వ్యాపారులంతా ఎండలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి వాటిని అర్హులైన రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న కూరగాయల వ్యాపారులకు పంపిణీ చేసి వారికి న్యాయం చేయాలని వ్యాపారస్తులు కోరుకుంటున్నారు.

### అర్హులైన వారికి అందజేయాలని ఎంఎల్ఎను కలిసిన వ్యాపారులు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన ఫ్రూట్ షాప్ల షెడ్లను అర్హులైన వ్యాపారులకు అందజేయాలని కోరుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వ్యాపారస్తులు విన్నవించారు. నిర్మాణం చేపట్టిన వ్యాపారులు రోడ్డుపై ఎండలో కూర్చొని వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని అర్హులైన పండ్ల వ్యాపారులకు షాపులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వ్యాపారస్తులు వివరించారు. ఖాళీగా ఉన్న షాపులను వెంటనే ఫ్రూట్ మర్చంట్ షెడ్లను పండ్ల వ్యాపారాలకు అప్పగించి వ్యాపారం చేయడానికి వీలుగా మౌలిక సదుపాయాలు కల్పించి ఇవ్వాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి చురు వ్యాపారులు తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకొని షాపులు కేటాయింపు మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అదృశ్యమైన వ్యక్తి



ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ కు చెందిన పరికి పండ్ల వెంకటేశ్వర్లు మార్చి 25న మిస్సయ్యాడని భార్య పరికిపండ్ల ఉమా భూపాలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పరికిపండ్ల వెంకటేశ్వర్లు (60) ఎరుపు రంగు, ఆరెంజ్ కలర్ షర్ట్స్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించాడని తెలిపారు. ఎవరికైనా కనబడితే వెంటనే ఈ క్రింది ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయగలరని సూచించారు. 7013099709, 9030755298 తెలిసినవారు పైన నంబర్లకు ఫోన్ చేయగలరని తెలిపారు. ఐదు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు ఆయన ఆచూకీ తెలియలేదు.

## చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పి కిరణ్ ఖరే



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సిఆర్ నగర్ (బాంబుల గడ్డ)లో ఏర్పాటు చేయబడిన స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్ చెక్ పోస్ట్ ను శనివారం ఎస్పీ కిరణ్ ఖరే తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాలు, ఎన్నికలలో ప్రభావితం చేసే బహుమతులను, రవాణా కాకుండా చెక్ పోస్ట్ ను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. 24 గంటలు చెక్పోస్టుల నందు తనిఖీ నిర్వహించాలని తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరి అని పేర్కొన్నారు. చెక్ పోస్ట్ అధికారులు సమన్వయంతో, అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఎస్పి పేర్కొన్నారు.

## ప్రజల ఆరోగ్యాలతో చెలగామాడితే సహించేది లేదు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జిల్లా ప్రజల ఆరోగ్యం పై చెలగాటం ఆడితే సహించేది లేదని ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్ రెడ్డి హెచ్చరించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జ్యూస్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో జ్యూస్ సెంటర్లలో కల్తీ జరుగుతుందని సమాచారంతో జ్యూస్ సెంటర్లను తనిఖీ చేసి పలు రకాల జ్యూస్ శాంపిల్స్ సేకరించి రిపోర్టును పట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో కల్తీ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, హోటల్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కల్తీ ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎలాంటి కల్తీ జరిగిన వెంటనే మా డిపార్ట్మెంట్ కు సమాచారం అందించాలని కోరారు.

## ఎంపీ అభ్యర్థికి అభినందనలు తెలిపిన నాయకులు

ప్రజాపక్షం/బచ్చన్నపేట : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్పార్టీ ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్కుమార్రెడ్డిని ప్రకటించిన సందర్భంగా మండల యువ నాయకులు నల్ల అశోక్ కుమార్, గంగరబోయిన మహేందర్, బందారం క్రాంతికుమార్, కర్రె నరేష్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చామల కిరణ్కుమార్రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీ లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంటు టికెట్ మాదిగలకు ఇవ్వాలి



ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ : కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలని దళిత సంఘాలు శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి దళిత సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా అధికంగా ఉన్నదని, అలాగే వరంగల్ పార్లమెంటు పరిధిలో మాదిగల జనాభా శాతం ఎక్కువగా ఉందని కానీ కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకొని పనిచేసిన మాదిగలకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా పిసిసి అధ్యక్షుడు సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకు కేటాయించాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పుల్ల ప్రేమ్ సాగర్ కోడెపాక సంజీవయ్య, మంతెన రాజేష్, కొమురయ్య, సంజీవ్, శ్రీనివాస్, రాజమౌళి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలంలో వివాదం

### ప్రభుత్వ స్థలం కాదని తేల్చిన రెవెన్యూ అధికారులు



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీ గ్రామంలో నూతన గ్రామ పంచాయితీకి శంకుస్థాపన చేసి నిబంధనల మేరకు స్థలం కేటాయించకపోవడంతో వివాదం తలెత్తింది. గ్రామ పంచాయితీ నూతన భవనం నిర్మించాలని అప్పటి గ్రామ పాలకవర్గం నిర్ణయించింది. తమకు పట్టాలు ఉన్నాయని మా స్థలంలో గ్రామ పంచాయితీ ఎలా నిర్మిస్తారని వల్లెపు తిరుపతి, వల్లెపు మొగిలి అనే పట్టాదారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఆ స్థలంలో ఇటీవల పట్టాదారుడు ప్రహరీ గోడ నిర్మిస్తుండగా కొందమంది మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాగా శనివారం తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ నరసింహా, సర్వేయర్ సురేందర్తో కలిసి విచారణ చేపట్టారు. సదరు స్థలంలో ప్రభుత్వ భూమి కాదని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీ ఎన్నికల ముందు హుస్నాబాద్ మాజీ ఎంఎల్ఎ సతీష్ కుమార్ చేతులా మీదుగా తాత్కాలిక శిలఫలకం ఏర్పాటుచేసి శంకుస్థాపన చేసారు. ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేయడం, స్థల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యంతోనే వివాదం నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో స్థలం కేటాయించిన తర్వాతనే నూతన గ్రామపంచాయితీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎంపిడిఒ వీరేశం, పంచాయితీ రాజ్ ఎఇ సంతోష్ తెలిపారు.

# కడియం చేరికపై కాంగ్రెస్లో గుస్సా



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : స్టేషన్ఘనపూర్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి కాంగ్రెస్లో చేరడాన్ని ఆ పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర నేతలు ఆహ్వానిస్తుంటే స్టేషన్ఘనపూర్ నాయకులు మాత్రం కడియం శ్రీహరిని చేర్చుకోవద్దంటున్నారు. నియోజకవర్గ ఇంఛార్జీ సింగపురం ఇందిర ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ స్థాయి నాయకులు హైదరాబాద్లో సమావేశం అయ్యారు. మండల స్థాయి నాయకులు మండలాల్లోనే విలేకర్ల సమావేశం నిర్వయించారు. రాష్ట్ర ఇంఛార్జీ దీపాదాస్ మున్షీని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింగపురం ఇందిర మాట్లాడుతూ కడియం శ్రీహరి అనేక మోసాలు చేశాడన్నారు. గత ముప్పై ఏండ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై కక్ష సాదింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. కడియం శ్రీహరిని చేర్చుకోవద్దని త్వరలోనే వేలాది మందితో హైదరాబాద్ తరలి వెళ్లి నిరసన తెలుపుతామన్నారు. అధిష్టానం ఇప్పటికైనా ఆలోచించాలని కోరారు. అవసరమైతే డిల్లీ వెళ్లి రాహుల్గాంధీ, ఇందిరా గాంధీని కలుస్తామన్నారు. కడియం శ్రీహరి వలన కాంగ్రెస్కు జరిగిన నష్టాన్ని ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

## పిఒలు, ఎపిఒలు ఫార్మ్ 12లో సవరణలు చేసుకోవాలి

ప్రజాపక్షం-జనగామ ప్రతినిధి : పిఒలు,ఎపిఒలు ఫార్మ్ 12లో సవరణ చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో లోక్సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్స్పై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్రిల్ 1,2 తేదీల్లో పిఒలు, ఎపిఓలు ఎన్నికల నిర్వాహనపై శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఫార్మ్ 12ను పరిశీలించి ఎపిక్ కార్డు జత చేసి రెండు అప్లన్లతో తహశీల్దార్లకు అందజేయాలన్నారు. ఎప్రిల్ 1,2 తేదీల్లో జరిగే శిక్షణలో పోస్టల్ బ్యాలెట్స్కు సంబందిచి తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించడం జరుగుతుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ అనిల్కుమార్, ఏఓ రవీందర్, డిఐఈఓ రాంప్రసాద్, అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులు తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జిల్లాలో బచ్చన్నపేట మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అదనపు కలెక్టర్ రోహిత్సింగ్తో కలిసి ప్రారంభించారు. ఈ సందరగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పకడ్బంది ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, నీడ, షెడ్లు, టెంట్లు, కుర్చీలు తదితర మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ రోజారాణి, డిఏఓ వినోద్కుమార్, డిసిఓ రాజేందర్రెడ్డి, టిడి సిఎస్ శ్రీనివాస్, దేవా, తహశీల్దార్ విశాలాక్షి, ఎంపిడిఓ రఘురామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇ సేవ కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ సేవ కేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు ప్రారంభించారు. కేసులయొక్క స్థితిని, కేసు వాయిదా ఏ తేదీన వుంది అని తెలుసుకోవాలని అనుకునే వారు ఈసేవా కేంద్రం లో సంప్రదించాలని జడ్జి అన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ సేవ కేంద్రం కోర్టు న్యాయవాదులకు కక్షి దారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జడ్జి తెలిపారు. వివిధ కేసులలో చిక్కుకొని కోర్టుకు హాజరవుతున్న కక్షిదారుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్టు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి ఎన్.రామచంద్ర రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, ఏపి అనితవాణి, కోర్టు సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

**ప్రజాపక్షం/తొర్రూరు :** మండలంలోని వెలికట్టె గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువజన నాయకుడు పల్లె ప్రవీన్ వివాహానికి మాజీ మంత్రి, పాలకుర్తి ఎంఎల్ఏ ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ ప్రవీన్ బిఆర్ఎస్ పార్టీలో యువజన నాయకుడిగా మంచి పేరు సంపాదించారని, అదే విధంగా వివాహ జీవితంలో అడుగు పెడుతున్న ప్రవీన్ ప్రియాంకల జీవితం నిండా నూరెళ్ళు పచ్చగా ఉండాలని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో తొర్రూరు ఎంపిపి తూర్పాటి చిన్న అంజయ్య, తొర్రూరు జెడ్పిటీసీ, మహబాదు జిల్లా ఫ్లోర్ లీడర్ మంగలపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, నాయకులు అంకూస్, పోసాని రాములు, బత్తుల యాకయ్య, దామోదర్‌రావు, లింగారావు, దేవేందర్ రావు, రాంబాబు, బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఎంపి అభ్యర్థి



**ప్రజాపక్షం/కేసముద్రం :** మండల ఉప్పరపల్లి గ్రామంలో సీతా రామ చంద్ర స్వామి, రామలింగేశ్వర స్వామి, గ్రామ దేవత బొడ్రాయి తల్లి మూడవ వార్షికోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక నాయక్ మాట్లాడుతూ మహబూబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు అష్ట ఐశ్వర్యలతో విరజిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు ,బండారు దయాకర్, పీసీసీ సభ్యులు దస్రునాయక్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, తండ రామయ్య చాగంటి రాములు, తండ సంపత్, ఆవుల లింగయ్య, అడప రమేష్ ,పోగాకుల రమేష్, అరిగే విజేందర్,బైరు రాజు కుమార్, రాయబారపు భూమయ్య, వెంకన్న, నలగుర్తి ఉపేందర్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

**ప్రజాపక్షం/మంగపేట్ :** ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిఎస్‌పి ములుగు జిల్లా అధ్యక్షులు కాడపాక రాజశేఖర్ వర్మ శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని అన్నారు. కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, ములుగు జిల్లాలో ప్రతి గ్రామంలో గడప గడపకి బహుజన్ సమాజ్ పార్టీ (బి ఎస్ పి) నీ తీసుకెళతానని ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో మా బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అభ్యర్థి గెలుపు దిశగా పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి మైస సతీష్, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు అజయ్, జిల్లా నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరు బైండోవార్



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మండలంలోని రామకృష్టపూర్(వి),గర్మిళ్లపల్లి గ్రామలలో కిరాణం షాపులలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని నమ్మదగిన సమచారం మేరకు మంచాల మల్లయ్య,కటకం శ్రీనివాస్‌లను టేనివాస్‌లను తహసిల్దార్ విజయలక్ష్మీ ముందు బైండోవార్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.దేశ వ్యాప్తంగా జరుగుతున్నా పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మండలంలోని ఎవరైన అక్రమంగా బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అన్నారు.

# నిబంధనల మేరకు ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణను ఎన్నికల సంఘం నిబంధనలు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు తో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించినప్పుడు లేదా ప్రచురించినప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణ కర్త పేర్లు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్లు ప్రింట్ లైన్ యందు స్పష్టంగా సూచించాలన్నారు. ముద్రించబడిన ప్రతులను (ప్రింటడ్ మెటీరియల్ కాపీలను) 3 అదనపు ప్రింట్ లతో పాటు ప్రింట్ చేసిన మూడు రోజుల్లోపు ప్రచరణ కర్త నుండి పొందిన డిక్లరేషన్ తో సహా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం నందు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127 (ఏ) ప్రకారం పంపాలని తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ లు ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, మొదలైన వాటి ముద్రణ చేపట్టే ముందు నిర్దేశించిన ప్రోఫార్మా లో సెక్షన్ 127 ఏ (2) ప్రకారం ప్రచురణ కర్త నుంచి డిక్లరేషన్ పొందాలని, డిక్లరేషన్ పై ప్రచురణకర్త సంతకం, సూచించిన ఇద్దరు వ్యక్తులచే ధ్రువీకరించబడాలని, దీనిని జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ధ్రువీకరించాలని పేర్కొన్నారు. ప్రింటర్ మెటీరియల్ డిక్లరేషన్ తో పాటు సూచించిన ప్రొఫార్మాలో ముద్రించిన డాక్యుమెంట్ కాపీల సంఖ్య సదరు ప్రింటింగ్ పనికి వసూలు చేసిన ధరకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రింటర్లు మూడు రోజుల్లోపు



అందించాలని, అట్టి ప్రతి ముద్రించిన మూడు రోజుల్లోపు ముద్రించిన ఎన్నికల కరపత్రాలు పోస్టర్లు మొదలైన వాటికి సంబంధించిన సమాచారాన్ని ప్రింటర్ ఒకేసారి కాకుండా విడిగా అందించాలని, ఈ ఆదేశాలు ఉల్లంగిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్ రద్దు చేయడంతో సహా ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

## దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే

### కుట్రలో భాగామే బ్యాంక్ అకౌంట్ లను ఫ్రీజ్

### జక్కి శ్రీకాంత్

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** బిజెపి ప్రభుత్వం రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం కోసం కుట్రచేసి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఏఐసీసీ యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం జరిగిందన్నారు. అకౌంట్లను ఫ్రీజ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు జక్కి శ్రీకాంత్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని బలిపీఠం వైపు నెట్టేస్తుందని ఇష్టమునుసారంగా ఇన్కమ్ టాక్స్ సిబిఐ ఈడీలను ఉపయోగించుకొని రాజకీయ పార్టీలపై రాజకీయ నాయకులపై కుట్రపూరితమైన చర్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎన్నికల ముందు ఆర్థికంగా బలహీనపరచాలని చేస్తున్న కుట్లను దేశ ప్రజలు తిప్పి



కొడతారన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం కోసం భారతదేశమంతా సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. సుప్రీంకోర్టు ఎలక్ట్రోడ్ బాండ్లను అడిగినప్పుడు జాప్యం చేసింది బిజెపి ప్రభుత్వమేనని ఆ ఎలక్ట్రోల్ బాండ్ సమాచారంపై విచారణ జరపాలని, బిజెపి పార్టీకి వచ్చిన ఎలక్ట్రోల్ బాండ్లపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన రాహుల్ గాంధీ పైన ఎన్నో కేసులు పెట్టి వేధించింది చూసినం భారత్ జోడో యాత్ర, నాయ్ యాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## కెసిఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** నేడు పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పల మండలంలో ఎండిన పంటలను పరిశీలించడానికి వస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తొర్రూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు కోరారు. శనివారం తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పల మండలం ధారావత్ తండాలో సాగునీరు లేక ఎండిపోతున్న పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కరువుకు అల్లాడుతున్న రైతాంగానికి దైర్యాన్ని నింపేందుకు ఉదయం 9.30 గంటలకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, పాలకుర్తి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వస్తున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిదులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/రాయపర్తి :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జీ హనుమాండ్ల ఝూన్సీరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోలన్‌పల్లి గ్రామంలో శనివారం కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన



కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంచుకోవాలని, దైవ భక్తిని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఈదులకంటి రవిందర్ రెడ్డి, పాలకుర్తి సోమేశ్వర ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్,సరికొండ క్రిష్ణా రెడ్డి, మచ్చ నీలయ్య, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఈరెడ్డి నర్సింహరెడ్డి, గబ్బెట బాబు, గుగులోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును విచారిస్తున్న డిఎస్‌పి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో గత మూడు రోజుల క్రితం దళిత మాజీ ఉప సర్పంచ్ కొమ్మట బాబు భూమిలో రోడ్డు విషయంలో జరిగిన గొడవ విషయం పై శనివారం తూప్రాన్



డీఎస్పీ వెంకట్ రెడ్డి, సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం కులం పేరుతో దూషించి వ్యక్తిపై దాడి చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదుగా ఈ విషయంపై విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోస్థానిక ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని వదిలి పెడితే కాళ్లు మొక్కనా తిరిగి చేర్చుకోం



### మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**ప్రజాపక్షం/గజ్వేల్ :** కష్ట కాలంలో పార్టీని విడిచి పెడితే కాళ్ళు మొక్కినా తిరిగి తీసుకొమని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన గజ్వేల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని, 100 రోజుల్లో హామీలు నీటి బుడగలు, ఉద్దేర పథకాలు చేపట్టినట్లు ఎద్దేవా చేశారు. ఆర్టీసీ, సివిల్ సప్లై దివాళా తీయడం ఖాయమని, పింఛన్ రూ 4 వేలు, రైతు బంధు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు రాలేదని విమర్శించారు. 6 నెలలు ఓపిక పట్టండని, భవిష్యత్ మనదేనని, మళ్లీ మనం అధికారంలోకి రావడం ఖాయమని, మనకు నష్టం చేసిన వాళ్ళను విడిచి పెట్టేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామని తెలిపారు. ఇక నుండి నా ప్రాణం అడ్డు పెట్టి కాపాడుకుంటానని, భూములు కబ్జా చేసిన వారు, అవినీతి చేసిన వ్యక్తులు పార్టీలు మారుతున్నట్లు స్పష్టం చేశారు. 10 ఏళ్లలో ఎవరిని వేధించలేదని, చీమెత్తు అపకారం చేయలేదని అన్నారు. కేసీఆర్ ఉండగా రాష్ట్ర గౌరవం నిలబెట్టామని, 50 ఏళ్ల అభివృద్ధి 10 ఏళ్లలో జరిగిందని గుర్తు చేశారు. పంటలు కాపాడేందుకు రాత్రి ఫోన్ చేస్తే తెల్లారి కూడవెల్లి లోకి నీళ్లు విడుదల చేశామని చెప్పారు. తాగు, సాగునీరు, జిల్లా ఆసుపత్రి, మాతా శిశు కేంద్రం నిర్మించుకున్నామని చెప్పారు. బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి మంచి వ్యక్తని, మనసున్న వ్యక్తని, రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కష్ట కాలంలో విబేధాలు మరిచి జిద్దు కొద్దీ పనిచేద్దామని, దుబ్బాకలో మోసం చేస్తే బండ కేసి కొట్టారని, గజ్వేల్ మీద కేసీఆర్ కు ఉన్న ప్రేమ రఘునందన్ కు ఎందుకు ఉంటుందని నిలదీశారు. బిఆర్ఎస్ అభ్యర్థి వెంకటరాంరెడ్డి మాట్లాడుతూ మీరు కష్ట పడితే గులాబీ జెండాకు తిరుగు ఉండదని, రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటుతో పార్టీ కార్యకర్తలకు విద్యా అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ భారీ అధిక్యంతో వెంకట్రాం రెడ్డి గెలుపు ఖాయమని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాచగిరి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, డాక్టర్ మల్లేశం, బాలు యాదవ్ , జిల్లా యువజన విభాగం అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిలిండర్ పేలుడు మృతుల కుటుంబాలకు ఆపన్న హస్తం

**ప్రజాపక్షం/జహీరాబాద్ :** ఇటీవల ప్రమాదవశాత్తు గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో పట్టణ పరిధిలో ఇరువురు మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించి, 35వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందించిన ఎరుకల సంఘం బాధ్యులు, మానవతవాదులు అందించి ఆపన్న హస్తాన్ని అందించారు. సంగరెడ్డి జిల్లా శాసనసభ పరిధి జహీరాబాద్ పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు విధికి చెందిన ఎరుకల లక్ష్మయ్య వంటా అయ్యే క్రమంలో గ్యాస్ ప్రమాదం సంభవించిన ఘటనలో వారి కోడలు, మనుమరాలు గాయాల



పాలై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య, చిన్నారి కీర్తి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు లక్ష్మయ్య కోడలు సుగుణ కోలుకుంటున్నారు. బాధితులకు తోచిన సహాయం అందించాలానే ఉద్దేశంతో ఎరుకల సంఘం వారు, ఇతరులు కలిసి నిత్యవసర వస్తువులు, 35 ఆర్థిక సహాయం చేసి వారికి మనోధైర్యం కల్పించి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం జహీరాబాద్ తాలూకా అధ్యక్షుడు మదుగొండ మహేష్, శివరాజ్, నిమ్మల కిష్టయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బరూర్ దత్తాత్రి ముదిరాజ్, అశోక్, నారాయణ, పెంటన్న, తుకారాం, రాజు, శ్రీనివాస్, సంతోష్ సహాయం అందించిన వారిలో ఉన్నారు.

## ఎల్ అండ్ సౌజన్యంతో నూతన తరగతి గదులు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి తెలంగాణ స్టేట్ రెసిడిన్షియల్ స్కూల్ ,జూనియర కళాశాలకి శుక్రవారం మద్యాహ్నం సీఎస్ఆర్ లో భాగంగా ఎల్ అండ్ టీ ఐడిపియల్ డెక్కన్ టోల్వేస్ వారు నూతనంగా నిర్మించిన నాలుగు తరగతి గదులను రీజీనల్ హెడ్ వినీస్ కుమార్ ప్రాజెక్టు హెడ్ రాజేష్, విచారే ప్రారంబించారు. లింగంపల్లి రెసిడిన్షియల్ ప్రిన్సిపాల్ చైతన్య హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సిబ్బంది ఉపాద్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## రంజాన్ ఉపవాస దీక్షలో పాల్గొన్న రాష్ట్ర వైద్య శాఖ మంత్రి

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** రంజాన్ ఉపవాస దీక్షలో నేపథ్యంలో భాగంగా అందోల్, జోగిపేట, మున్సిపాలిటీ పరిధిలోని ఖదీమ్ ,మసీదు వద్ద మైనార్టీలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు మైనార్టీ మత పెద్దల సమక్షంలో మైనార్టీలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దీక్ష విరమణ సమయం సైరన్ రాగానే మైనార్టీ నాయకులు ఉపవాస దీక్షను మంత్రితో కలిసి అన్ని రకాల పండ్లతో కలిసి విరమించారు. మంత్రికి కూడా పండ్లను తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఇఫార్ విందులో జహీరాబాద్ మాజీఎం పి సురేష్ శేట్కర్, మైనార్టీ యువ నాయకులు సోహెల్ ఖాన్, ఖలీద్ ,ఇమ్రాన్, అక్రమ్ ఇమ్రాన్, ముతీబ్, చోట్‌ఖాన్, ప్రజాప్రతినిధులు చిట్టి బాబు, డాకూరి శివశంకర్, నాయకులు డాకూరి వెంకటేశం పట్లోళ్ల ప్రవీణ్, అబ్బాస్, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్న హుండీల లెక్కింపు



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం 15 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించారు.ఈ సందర్భంగా వచ్చిన రూపాయలు 61,89,123, విదేశీ కరెన్సీ 23 నోట్లు, మిశ్రమ బంగారం 75 గ్రాములు, వెండి 6కిలోల 400 గ్రాములు, 1200కిలోల బియ్యం కింటాలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జ్ ఏసి శివరాజ్, ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు బచ్చల శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, పొల్లె శ్రీనివాస్, కాగిత మోహన్‌రెడ్డి, అల్లం శ్రీనివాస్, ఆలయ ఈవో బాలాజీ శర్మ, పోలీస్ సిబ్బంది, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్,లడ్డు, బాబు, రాధిక, మానస, ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో వెల్దుర్తి సోసైటి

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి బాటలో ప్రయనిస్తుందని సోసైటి చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. శనివారం వెల్దుర్తి సహకార సంఘంలో వార్షిక మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోసైటి చైర్మన్ అనంతరెడ్డి మాట్లాడుతూ... వెల్దుర్తిలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, నిధులు మంజూరు కాగానే పనుల ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే సహకార సంఘంలో నిర్వహించే వార్షిక మహాజన సభకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటి వరకు 1506 టన్నుల యూరియా, 1340 టన్నుల కాంప్లెక్స్, 497 బ్యాగుల పోటాష్ ఎరువులు రైతులకు అమ్మడం జరిగిందన్నారు. అలాగే ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 23 ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వానకాలం, యాసంగి సీజన్‌లో 9410 రైతుల నుండి 354626 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సోసైటి వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్లు రమేష్‌చందర్, కిష్ట గౌడ్, నర్సింలు , అమృత, మణెమ్మ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి తన్జీమ్‌కి ఎలాంటి సంబంధం లేదు...

* ఫారూఖ్ హుస్సేన్‌ను దేవుడు క్షమించడు....



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** రంజాన్ పండుగ నేపథ్యంలో ప్రతి సంవత్సరం పేద ముస్లిం ప్రజలకు ఓ స్వచ్చంద సంస్థ రంజాన్ తోఫాలను అందజేస్తుందని,రంజాన్ తోఫాలపై బిఆర్ఎస్ పార్టీకి ఏమి సంబంధమని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముస్లిం ప్రజలకు రంజాన్ తోఫాలను ఒక స్వచ్చంద సంస్థ పంపిణీ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకోదని,అందుకు మేము స్వాగతిస్తున్నామని అన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున స్వచ్చంద సంస్థ అందజేస్తున్న ఆ సరకులను ప్రభుత్వ అధికారులు అందజేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఆ సరకులను స్వచ్చంద సంస్థ కాకుండా బిఆర్ఎస్ పార్టీ ఇస్తున్నట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని అన్నారు. రంజాన్ తోఫాలను మదీన ఫంక్షన్ హాల్‌లో నిల్వ చేస్తే మాజీ ఎంఎల్‌సి ఫారూఖ్‌హుస్సేన్ ఆ తాళాలను పగలగొట్టారని ఆరోపించారు. అందుకే ఫారూఖ్‌హుస్సేన్‌పై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిందని దాన్ని రాజకీయంగా లబ్ది పొందేందుకు కాంగ్రెస్‌పై అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని అది ఆయన విజ్ఞతకే వదిలిపెడుతున్నామని అన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో అబద్దాలు ఆడుతున్న ఫారూఖ్‌హుస్సేన్‌ను ఆ దేవుడు క్షమించడని అన్నారు. ఈ వయస్సులో తొడలు కొడితే కండ నరాలు పట్టి నడవడం కూడా చేతకాదని ఎద్దేవా చేశారు. మరోసారి కాంగ్రెస్ పార్టీపై అనవసర రాద్ధాంతం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యాదరి మధు,గయాజుద్దీన్,రశద్,మహేష్ తదితరులు పాల్గోన్నారు.

# బిడి కార్మికులకు పెరిగిన కరువుభత్యం ఏప్రిల్ 1 నుండి అముల చేయాలి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బీడి కార్మికులకు పెరిగిన విడిఎ కరువు భత్యం ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని తెలంగాణ బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆది రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట ఎడ్ల గురువారెడ్డి కార్మిక భవనంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. బీడి పరిశ్రమలో పనిచేస్తున్న అన్నిరంగాల కార్మికుల సమస్యలపై అలాగే కమిషన్ ఏజెంట్లు ఎదుర్కోంటున్న సమస్యలపై రాబోయే కాలంలో పోరాడుతామన్నారు. బీడి పరిశ్రమ యజమాన్యలకు డిమాండ్ నోటీసు ఇవ్వటం జరిగిందన్నారు. పాత రేట్లు మీద దానికంటే 1000 బీడీలకు కమిషన్ రేట్లు 25 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. బీడి పరిశ్రమలో పనిచేయు అన్ని రకాల కార్మికులకు ప్రస్తుతం కూలీ రేట్లు వేతనాలపై ప్రస్తుతం వారు పొందుతున్న కూలీ రేట్లు వేతనాలను 65 శాతం పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్ నోటిసు ఇచ్చినట్లు తెలిపారు. పెరిగిన కరువు భత్యం వెయ్యి బీడీలకు 11.40 రూపాయలు అన్ని కలుపుకొని 245.8 పైసలు అవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులు రోజుకు 11.40 రూ చొప్పున నెలకు 339 రూపాయలు అవుతుందన్నారు. ఇట్టి పెరిగిన భత్యం ఏప్రిల్ 1 నుండి 2024 నుండి అన్ని బీడి వర్షంలో పనిచేయుచున్న బీడీ కార్మికులకు ఇతర రకాల కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఏఐటైయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మ ణ్, బీడీ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.




## బిఆర్ఎస్ పార్టీ నుండి బీజేపిలో చేరికలు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి సమ్మయ్య, డాక్టర్ సుధాకర్‌ల ఆధ్వర్యంలో బీజేపి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంతరెడ్డిల సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. చేరిన వారిలో ఈరవెన్ను ఎంపీటీసీ యాదగిరి, గ్రామశాఖ అధ్యక్షుడు ముస్కు ఉప్పలయ్య, సహకార బ్యాంక్ డైరక్టర్ గాదరి కాంతమ్మ ఎల్లయ్యలతో పాటు పలువురున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపి మాజీ అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మారం రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుగళ్లు గ్రామం నుండి బిజెపిలో చేరిక

**ప్రజాపక్షం/జఫర్గడ్ :** జఫర్గడ్ మండలం ఉప్పుగళ్లు గ్రామం నుండి పిఏసిఎస్ డైరెక్టర్ బిఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి గడ్డం రాజు గౌడ్ 2వార్డ్ మాజీ మెంబర్ పులి రాజు గౌడ్ బిఆర్ఎస్ కార్మికవిభాగం మండల అధ్యక్షులు నాయిని యాదగిరి గౌడ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు మూల యాకయ్య గౌడ్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్, సమక్షం లో భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు బుర్ర తిరుపతి గౌడ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు చేసిన కార్మికులకు వేంటనే వేతనాలు అందించాలి



**ప్రజాపక్షం/టేకుమట్ల :** మండలంలోని ఉపాధి పనులు చేసిన కార్మికులకు వేంటనే వేతనాలు అందించాలని ఎపిఓ మాధవి కు వినతి పత్రాన్ని సిపిఐఎమ్ఎల్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ అందించారు.ఈ సందర్భంగా అయాన మాట్లాడతూ జాతీయ ఉపాధి హామి కూలీలకు పని చేసిన వేతనాలను వారానికి ఒక సారి ఇవ్వాలని పెరిగిన వేతనాలను ఉపాధి కూలీలకు అమలు చేయాలని,నూతన జాబ్‌కార్డులను మంజూరు ఇప్పించాలన్నారు.ఉపాధి కూలీలకు పనిచేసే చోట మంచినీటి సౌకర్యం ,మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని కోరారు.ఉపాధి పని దినాలు రెండు వందల రోజులు కల్పించాలని జిల్లా ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకపోయి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విసికె విముక్తి చిరుతల పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్,జిల్లా నాయకులు సంగి రాజు పాల్గోన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీ పట్టివేత..




**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్ :** ప్రభుత్వ అనుమతి,వే బిల్ లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నెంబర్ TS19TA7500 గల లారీ భూపాలపల్లి నుండి హైదరాబాద్ వెళ్లుచుండగా మార్గమధ్యన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ ధర్మకాంట వద్ద లారీ ఉన్నదని నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు,త్రీటౌన్ పోలీసులు కలిసి లారీని పట్టుకున్నారు. త్రీటౌన్ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన మరియు పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.